క్లుప్తంగా

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారి పేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు కుంకుమ బండ్లతో సత్యమాంబదేవి ఆలయం వద్దకు తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గుంటిగంగా భవానికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటి గంగాభవాని అమ్మవారికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు బాలరాజు, కామేశ్వరశర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈఓ కార్తీక్ భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఈనెల 21వ తేదీన ఆలయంలో మహాచండీ యాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఈఓ కార్తీక్‌లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కో ఆప్షన్ సభ్యునిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న ఇబ్రహీమ్ హోటల్‌లో నగర పంచాయతీ కో ఆప్షన్ సభ్యుడు షేక్.మస్తాన్‌వలిపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అకారణంగా దాడికి పాల్పడ్డారు. అనంతరం దుండగులు సంఘటనా స్థలం నుంచి పారిపోయారు. ఈ విషయమై మస్తాన్‌వలి సీఐ వైవీ సోమయ్యకు ఫిర్యాదు చేశారు. మస్తాన్‌వలిపై దాడికి ఘటన దృశ్యాలను స్థానిక హోటల్ నిర్వాహకుల వద్ద నుంచి సీసీ ఫుటేజీలు తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

ముండ్లమూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తామని రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని రూడ్‌సెట్‌లో ఈ నెల 24వ తేదీ నుంచి ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. టైలరింగ్ పట్ల ఆసక్తి గల 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు గల మహిళలు రేషన్ కార్డు, ఆధార్ కార్డుతో నేరుగా శిక్షణకు హాజరుకావచ్చని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి సౌకర్యం, ఉచిత భోజనం కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల మహిళలు పూర్తి వివరాల కోసం 9573363141 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు శ్రీనివాస కళ్యాణ మహోత్సవం

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు భూసమేత మలయప్ప స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం 11 గంటలకు కళ్యాణ ఉభయదాతలు వరికుంట్ల అనిల్‌కుమార్, లక్ష్మీ సురేఖ దంపతులు కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామి వారి కళ్యాణ అక్షతలు, తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని ప్రధాన అర్చకుడు దీవి శ్రీకాంత్ భట్టర్, ప్రధాన సలహాదారులు నారాయణం మురళీ కృష్ణమాచార్యులు కోరారు.

వైభవంగా శ్రీగిరి బ్రహ్మోత్సవాలు



స్వామివారి ధ్వజారోహణ కార్యక్రమంలో అర్చకులు



ఆండాళ్ కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద గల శ్రీగిరి వేంకటేశ్వరస్వామి 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తజన నయన మనోహరంగా జరుగుతున్నాయి. ఆదివారం రెండోరోజు ఉదయం రక్షా బంధనం, భేరీపూజ, ధ్వజారోహణం, శ్రీవారి ఉత్సవమూర్తులకు విశేష స్నపన తిరుమంజనం కార్యక్రమాలను పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం రక్షా బంధనం, కుంభ పూజ, బలి హోమం కార్యక్రమాలు, శ్రీగిరి ఆలయ అర్చకులు, వేదపండితులచే శ్రీవారికి సహస్ర నామార్చన జరిగాయి. ఆలయ అర్చకులు, వేదపండితులు శ్రీవారికి శేషవాహన సేవ నిర్వహించారు. శేష వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీగిరి శ్రీ వేంకటేశ్వరస్వామిని భక్తులు నేత్రపర్వంగా దర్శించి తన్మయత్వంతో గోవింద నామస్మరణ చేశారు.

అలరించిన శ్రీ ఆండాళ్ కూచిపూడి నృత్య రూపకం...

విష్ణుచిత్తుని కుమార్తె అయిన గోదాదేవి అమలిన నిష్కల్మష ప్రణయ పరిణయ గాధను, భక్తి మార్గ విశిష్టతను రింద శరణ్య కూచిపూడి డ్యాన్స్ అకాడమీ (హైదరాబాద్) కళాకారులు నృత్య రూపకం ద్వారా చక్కగా ఆవిష్కరించారు. ప్రేక్షకుల కరతాళ ధ్వనులకు, అభినందనలకు పాత్రులయ్యారు. భగవంతుడిని చేరుకునేందుకు భక్తి మార్గం ఒక్కటే శరణ్యమని గోదా దేవి రుజువు చేసి దివ్య పాశురగానంతో శ్రీరంగనాథుని మెప్పించి ఆయననే భర్తగా వరించిందని, శ్రీరంగ నాథునిలో లీనమైన దివ్య చరితను శ్రీ ఆండాళ్ కూచిపూడి నృత్య రూపకం అద్భుతంగా చాటి చెప్పింది. ఆండాళ్ (గోదాదేవి)గా అలేఖ్య, శ్రీరంగనాథునిగా అనన్య, విష్ణుచిత్తునిగా సహస్ర, రాజుగా హరిణి, బాల గోదగా తేజస్వి, గరుత్మంతుడుగా ఆలూరు శ్రీనిధి, చెలికత్తెలుగా సిరి, సంయుక్త, శ్రీనిధి వారివారి పాత్రలకు చక్కటి రసభావ ప్రకటన చేశారు. శ్రీ ఆండాళ్ కూచిపూడి నృత్య రూపక ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను, సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ యశోదా ఠాకూర్‌ను శ్రీగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారితో పాటు ఆలూరు జై శంకర్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జీవో నంబర్ 117ను రద్దు చేయాలి

- ఎస్‌టీయూ ఏపీ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి



మాట్లాడుతున్న ఎస్‌టీయూ ఏపీ అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి

ఒంగోలు: జీవో నంబర్ 117ను తక్షణమే రద్దు చేయాలని ఎస్‌టీయూ ఏపీ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో నంబర్ 117 ద్వారా అనేక పాఠశాలలు మూతపడ్డాయన్నారు. ఆ పాఠశాలలను బాగుచేయాలని నూతన ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కె.ఎ ర్రయ్య మాట్లాడుతూ పీఆర్‌సీకి ముందుగా ఐఆర్ ప్రకటించాలని, డీఏ బకాయిలు సకాలంలో చెల్లించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ పదోన్నతులు చేపట్టి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సమస్యలు పరిష్కరించాలి



దామచర్ల జనార్దన్‌తో కళా సాహితీ సంస్థల ప్రతినిధులు

ఒంగోలు మెట్రో: కళాకారుల సమస్యలు పరిష్కరించాలని, వృద్ధ కళాకారులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని నగరంలోని పలు కళా సాహితీ సంస్థల ప్రతినిధులు కోరారు. ఆదివారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఒంగోలులో శిల్పారామం ఏర్పాటు చేయాలని, కళాకారులకు కాలనీలు ఏర్పాటు చేయాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రంగభూమి కళాకారుల సంఘ ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, కోశాధికారి ధేనువుకొండ సుబ్బయ్య, ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరి శ్రీనివాసులు, కొండారెడ్డి, అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కల్లగుంట కృష్ణయ్య, ప్రముఖ వాస్తు జ్యోతిష్య సిద్ధాంతి అగస్త్యరాజు శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి డోలాకి ఘన స్వాగతం



వల్లూరమ్మ గుడిలో మంత్రి డోలాకు స్వాగతం పలుకుతున్న పూజారులు

ఒంగోలు సెంట్రల్: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటిసారి ఆదివారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర సాంఘిక, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ, సచివాలయ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. టోల్ గేట్ వద్ద, గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్, అగ్రికల్చర్ మార్కెట్ సెంటర్, ముంగమూరు బైపాస్ వద్ద అభిమానులు గజమాలలతో సన్మానించారు. ఒంగోలు నగరంలో బాణసంచా కాలుస్తూ వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. బొప్పూడి వద్ద ఆంజనేయస్వామి గుడిలో, వల్లూరమ్మ ఆలయంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దామచర్ల గోడౌన్స్ వద్ద కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, మద్దిపాడు, నాగులుప్పలపాడు, ఒంగోలు, కొండపి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందచేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

బేస్తవారిపేట: రైతులకు విత్తనాలు, వ్యవసాయ పరికరాలు 90 శాతం సబ్సిడీపై అందచేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.వీరారెడ్డి అన్నారు. బేస్తవారిపేటలో గిద్దలూరు నియోజకవర్గ స్థాయి రైతు సంఘం కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. అఖిల భారత కిసాన్‌సభ జాతీయ కార్యదర్శి అతుల్‌కుమార్ అంజన్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ అంజలి ఘటించారు. కార్యక్రమంలో నియోజకవర్గ రైతు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జక్కా అంకయ్య, దాకాల పుల్లయ్య, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఊరుమార్పు జోసెఫ్, రైతు సంఘం నాయకులు వేల్పుల అంకయ్య, టి. రంగారెడ్డి, ఎం కొండయ్య పాల్గొన్నారు.

కరాటే విజేతలకు సర్టిఫికెట్లు అందజేత



కరాటే పోటీలో పాల్గొన్న విద్యార్థులు

మార్కాపురం: కరాటే నేర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని, దీంతో పాటు ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని పట్టణ సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఎమ్ ఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టు పోటీలను మాస్టర్ చీఫ్ ఎగ్జామినర్ మారంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. 60 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ ఆడపిల్లలకు కూడా విద్యార్థి దశ నుంచే కరాటే నేర్పించాలని, ఆత్మరక్షణకు వారికి ఉపయోగపడుతుందన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కరాటే ఇన్‌స్ట్రక్టర్ తోట ప్రసాద్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత లక్ష్యాలు

గుడ్లూరు: విద్యార్థులు విద్యలో రాణించినప్పుడే ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారని గుడ్లూరు, చేవూరు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు రామ్మోహన్‌రావు, వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక అభ్యుదయ పాఠశాలలో అద్దంకి యశ్వంత్ సాయి తేజ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో 10వ తరగతిలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ఆదివారం అభినందన సభ నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడం వల్ల మిగిలిన విద్యార్థులు కూడా వారిని స్ఫూర్తిగా తీసుకొని బాగా చదువుతారన్నారు. ప్రతి సంవత్సరం ట్రస్టు చైర్మన్ అజయ్ బాబు తన కుమారుడు సాయితేజ జయంతి సందర్భంగా 10వ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందచేయడం అభినందనీయమన్నారు. ఉన్నత చదువులు చదివి చిన్న వయస్సులోనే అనారోగ్యంతో మృతి చెందడం దురదృష్టకరం అన్నారు. అనంతరం 10వ తరగతిలో మండల స్థాయిలో ప్రథమస్థానం సాధించిన గిరీష్‌కుమార్ (586), ద్వితీయస్థానం సాధించిన చలువాది భవ్యశ్రీ (576), తృతీయ స్థానం సాధించిన వేదవైష్ణవి(574) లకు వరుసగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు అందజేశారు. అలాగే 550 మార్కులు పైన సాధించిన 11 మంది విద్యార్థులకు నగదు, ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. ట్రస్టు చైర్మన్ అజయ్‌బాబు, రాజేశ్వరీ, రవీంద్రారెడ్డి, పద్మావతి, ఫణీంద్ర, సోమానాయుడు, కలగారెడ్డి, ఏసుబాబు పాల్గొన్నారు.

నేడు బక్రీద్ సందర్భంగా
ఒంగోలులో నమాజు వేళలు

ఒంగోలు టౌన్: నేడు పవిత్ర బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఒంగోలు నగరంలోని వివిధ మసీదులు, ఈద్గా మైదానాలలో నమాజు నిర్వహించే వేళలను ముస్లిం మత పెద్దలు ఆదివారం విడుదల చేశారు. ఈద్గా మైదానం వరకు వెళ్లలేని ముస్లింల సౌకర్యం కోసం నగరంలోని మసీదులలో ఈద్ నమాజు నిర్వహిస్తున్నారు.

జబేదా మసీదు	బయాన్- 6.15	జమాయత్- 6.45
మక్కా మసీదు	6.30	7.00
మదీనా మసీదు	7.00	7.30
అన్నవరప్పాడు	7.00	7.30
పోలీస్ క్వార్టర్స్	7.00	7.30
బిలాల్ మసీదు	7.00	7.30
రహమత్ మసీదు	7.00	7.30
నిసార్ మసీదు	7.00	7.30
సుఫియా మసీదు	7.00	7.30
గంటపాలెం మసీదు	7.30	8.00
హుసేని మసీదు	8.00	8.30
ఇస్మాయిల్ మసీదు	8.00	8.30
మర్కస్ మసీదు	8.00	8.30
జామియా మసీదు	9.00	9.30
హుదా మసీదు	9.30	10.00
ఈద్గా మైదానం	10.00	10.30

ముగిసిన గూగుల్ ఆండ్రాయిడ్ టెక్ క్యాంపు



అవగాహన కల్పిస్తున్న పవన్ కుమార్

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో గూగుల్ ఆండ్రాయిడ్ టెక్ క్యాంపు వర్క్‌షాప్ ఆదివారంతో ముగిసింది. ఎడ్యుస్కిల్స్ సంస్థ డెవలప్‌మెంట్ ట్రినర్ పవన్‌కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ టెక్ క్యాంపు వలన పేస్ కాలేజీ ఫైనలియర్ స్టూడెంట్స్ లేటెస్ట్ టెక్నాలజీలో ఒకటైన గూగుల్ ఆండ్రాయిడ్ అప్లికేషన్స్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టంను ఉపయోగించి మొబైల్లో అప్లికేషన్ ఎలా డెవలప్ చేయాలో క్లుప్తంగా వివరించారు. అప్లికేషన్స్‌ను మొబైల్లో ఎలా రన్ చేయాలో ప్రాక్టికల్‌గా కూడా తెలుసుకున్నారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఇలాంటి టెక్ క్యాంపులు విద్యార్థులకు అడ్వాన్స్ టెక్నాలజీలో మంచి ప్రాక్టికల్ నాలెడ్జి కలిగించడం ద్వారా పెద్ద ప్యాకేజీలతో ప్లేస్‌మెంట్స్‌లో ఎంపికవడానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

లార్డ్ కృష్ణ ఆడిటోరియంలో రక్తదానం



రక్తమిస్తున్న దాతలు

ఒంగోలు టౌన్: రక్తదానం చేయడం ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడినట్లేనని లార్డ్ కృష్ణ ఆడిటోరియం ప్రెసిడెంట్, ఆడిటర్ మురళీకృష్ణ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ముంగమూరుడొంకలోని లార్డ్ కృష్ణ ఆడిటోరియంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ పర్యవేక్షణలో జరిగిన ఈ రక్తదాన శిబిరంలో 18 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అన్నారని, సాటి మానవుడి ప్రాణాలను రక్షించే సేవ కంటే ఉత్తమమైన సేవ ఏమున్నదని ప్రశ్నించారు. రక్తదానంపై నేటి యువత అవగాహన కల్పించుకోవాలని, తరచూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు శ్రీదేవి, సుజాత, సింధూర, సంతోష్, మంగళగిరి నరసింహారావు, రాఘవ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాటమరాజు స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో వేనూతల కాటమరాజు స్వామి

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయతీలో నల్లమల అడవిలో వెలసిన శ్రీ వేనూతల కాటమరాజుస్వామి, గంగాభవానీలకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి స్వామి వారికి పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఆలయం ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి వారికి సమర్పించారు. యాదవులు భక్తిశ్రద్ధలతో దేవాలయం ప్రాంగణంలో స్వామి చుట్టూ బొల్లావును నెత్తిన పెట్టుకుని తప్పెట్లతో ఊరేగింపుగా ఆనందోత్సవంతో ప్రదక్షిణలు చేశారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కుబడులు చెల్లించారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ, పరిసర ప్రాంత ప్రజల గ్రామ ఇలవేల్పు అల్లూరి పోలేరమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. పోలేరమ్మ మూల విగ్రహ మూర్తిని అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పలువురు భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సమీపంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ పరిధిలో ఉన్న నాగ శిలలు, పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.